క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ 33/11కేవీ శుద్ధ గుంతల సబ్ స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మాచర్ల టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ గురువారం తెలిపారు. శుక్రవారం శుద్ధ గుంతల, పీడబ్ల్యూడీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతోందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాలికలపై వివక్ష తగదు

గురజాల: ఆడ, మగ అనే తేడా లేకుండా ఇరువురిని సమానంగా చూడాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై రత్నకుమారి సూచించారు. నగర పంచాయతీలోని యూపీహెచ్‌సీలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలురతో పాటు బాలికలు కూడా అన్ని రంగాల్లో సమానంగా ఉండాలని విద్యతో పాటు రాజకీయాల్లో కూడా సమాన హక్కులు ఉన్నాయని గుర్తుచేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను మండల అధికారులు గురువారం తనిఖీ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓలు అనిల్‌కుమార్, రవికుమార్‌లు విద్యార్థులతో కలసి భోజనం చేశారు. 460 మంది విద్యార్థులకు గాను 360 మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనానికి హాజరయ్యారని మిగతా 100 మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారని హెచ్‌ఎం శేషిరెడ్డి అధికారులకు వివరించారు. భోజనం భాగుందని మరింత రుచికరంగా తయారు చేసి మిగతా విద్యార్థులు కూడా భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను అధికారులు ఆదేశించారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక షిరిడీసాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలు రకాల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడీ సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజనా బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



చిలకా రమేష్ బాబు



ఎస్.గంగాధర్ రావు

మాచవరం: ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ డి.శ్రీధర్ తెలిపారు. మొర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పనిచేస్తున్న చిలకా రమేష్ బాబు, గంగిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న ఎస్.గంగాధర్ రావులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న గురుపూజోత్సవంలో ఈ అవార్డులు అందుకోనున్నారని తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

సత్తెనపల్లి: యువతి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్ గ్రామానికి చెందిన ఓ యువతి(20) సత్తెనపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 1న ఇంటి నుంచి తన స్నేహితురాలిని కలిసి వస్తానని చెప్పి సత్తెనపల్లి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఆమె తల్లి సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుధవారం రాత్రి పోలీసులు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు

పలు పాఠశాలల్లో గురు పూజోత్సవం



ముత్యాలపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రెంటచింతల: ఉపాధ్యాయునిగా ఉన్నతశిఖరాలను అధిరోహించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని రెంటచింతల ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం సిలార్ అహమ్మద్, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించి వారి భవిష్యత్‌కు బంగారుబాటవేసే గురువులను సర్వేపల్లి జన్మదినాన్ని గౌరవించుకోవడం మంచి సంప్రదాయమన్నారు. అనంతరం పాఠశాల హైస్కూల్ కావడానికి కృషి చేసిన ఎంఈఓను ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీ వివేక టెక్నోస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, పార్టీ యువజన నాయకులు రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు వీర వసంత కుమారి, శారద, టి. వెంకటేశ్వర్లు, సాయి భాస్కర్, మాధవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం..

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గురుపూజ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ తరపున తొమ్మిది మంది ఉపాధ్యాయులకు నేషనల్ బిల్డర్ అవార్డును అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోట రమేష్‌బాబు, సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం, అసిస్టెంట్ గవర్నర్ జె.మురళి, హెచ్‌ఎం మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి..

దాచేపల్లి: ఉపాధ్యాయులను గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ముత్యాలంపాడు ఆర్జిన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు యరవేద గురువారెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరరావు, హెచ్‌ఎం

హైస్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ట్రస్టు సభ్యులు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు గురవారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూనే సమాజంలో వారు ఏ విధంగా జీవించాలో కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. తమ ట్రస్టు ద్వారా గ్రామంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా ఉంటామని, భవిష్యత్తులో ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను ముత్యాలంపాడులో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గురవారెడ్డి చెప్పారు. సర్పంచ్ నెమలికంటి వెంకటాచారి, ఎంపీటీసీ పోసా నాగయ్య, దొండేటి సీతారామిరెడ్డి, కొత్త సైదారెడ్డి, హెచ్‌ఎంలు వెంకట సుబ్బారావు, బళ్లా మేరీ శ్యాంకుమారి, లంకే వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నేడు టీచర్స్ డే

మాచర్ల: పల్నాడు లయన్స్ క్లబ్, మాచర్ల లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం టీచర్స్‌డే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలో ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు, పల్నాడు జిల్లావ్యాప్తంగా 17 మంది ఉపాధ్యాయులను సత్కరించనున్నారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది..



గురజాల: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు దుశ్శాలువాలతో సత్కరించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సిస్టర్ అరుల్ రోజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ముందుగా కేక్‌ను కట్ చేసి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

యూరియా కొరతతో రైతులకు తీవ్ర ఇక్కట్లు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో రైతులు అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పంటలు నిలబడకముందే యూరియా కొరత స్పష్టంగా కనిపిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున యూరియా స్టాక్ ఉందని చెప్పుకొంటూ ప్రచారాలు చేస్తోందని, కానీ వాస్తవానికి రైతులకు ఒక్క సంచి కూడా అందడం లేదన్నారు. ఇది ప్రభుత్వం వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందక, పంటలు ఎండిపోతున్నాయన్నారు. మార్కెట్‌లో యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారని, బ్లాక్ మార్కెట్ అమ్మకాలతో అవినీతి పెరిగిపోతుందని, ప్రభుత్వం కనీసం చర్య తీసుకోవడం లేదన్నారు. వెంటనే నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు సమానంగా యూరియా అందేలా చూడాలన్నారు. రైతులందరికీ యూరియా పూర్తిస్థాయిలో అందేవరకు వైఎస్సార్ సీపీ వారి వెన్నంటి నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

తాగునీటికి కటకట

దాచేపల్లి: గుక్కెడు మంచినీటి కోసం గంటల తరబడి రోడ్డుపై పడికాపులు కాయాల్సిన దుస్థితి. ట్యాంకరు కోసం ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి నడికుడి వార్డు సచివాలయం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మందకొడిగా జరుగుతుండటంతో ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులను మూడు నెలల క్రితం తొలగించారు. పైపులైన్లు తీసేసిన తర్వాత రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. అయితే రోడ్డు విస్తరణ పనులు మందకొడిగా సాగుతూ ఉండటంతో నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రజలు తీవ్ర మంచినీటి కొరత ఎదుర్కొంటున్నారు. నగర పంచాయతీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటిని పట్టుకునేందుకు ఇళ్ల ముందు డబ్బాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డుకి ఇరువైపులా భారీస్థాయిలో ఈ డబ్బాలను మంచినీటి కోసం ఏర్పాటు చేసి పడికాపులు కాస్తున్నారు. ట్యాంకరు వచ్చినప్పుడు నీళ్లు పట్టుకునేందుకు ఎగబడుతున్నారు. ఒక బిందెడు నీటిని పట్టుకునేందుకు యుద్ధమే చేయాల్సిన దుస్థితి. ఇప్పటికైనా రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తిచేసి మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తాగునీటి కోసం రోడ్డుకి ఇరువైపులా డబ్బాలు పెట్టిన స్థానికులు

మదర్ థెరిస్సా విగ్రహం ప్రారంభం



దుర్గి: విశ్వమాత మదర్ థెరిస్సా విగ్రహ ప్రతిష్ఠను గురువారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో మదర్ థెరిస్సా ఆత్మీయ కళావేదిక వద్ద రెవ. ఫాదర్ మోపూర్తి రాయపరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం పాటు పడిన మహనీయురాలు మదర్ థెరిస్సా అన్నారు. ఎంతో మందికి సేవ చేశారన్నారు. అటువంటి మహనీయురాలిని స్మరించుకోవటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో శౌరయ్య, కవిత, గాదె రామకృష్ణ, చంద్రయ్య, కిరీటిరెడ్డి, గౌసు, మెట్టు గోవిందరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం 40 మంది అనాథలకు దుస్తులు పంపిణీ చేశారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణకు చర్యలు

కారెంపూడి: కారెంపూడి పట్టణ పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసేందుకు సంకల్పించినట్లు కారెంపూడి సెక్షన్ ఆర్‌అండ్‌బీ ఏఈఈ ఎండీ సుబ్బారావు గురువారం కారెంపూడి తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు లేఖను పంపారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరువైపులా కారెంపూడిలో ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించేందుకు అలాగే కారెంపూడి పట్టణంలో సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కారెంపూడి నుంచి దాచేపల్లి రోడ్డు, అలాగే నకరికల్లు నుంచి గురజాల రోడ్డులో కారెంపూడి పట్టణ పరిధిలో రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అలాగే వినుకొండ నుంచి మాచర్ల రోడ్డులో కారెంపూడి పట్టణంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను రోడ్డు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చి ఆక్రమణలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను తహసీల్దార్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సెపక్ తక్రా సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జిల్లా జట్లతో పీడీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఎంపికలకు పల్నాడు జిల్లా నుంచి బాలుర విభాగంలో 35 మంది, బాలికల విభాగంలో 20 మంది హాజరయ్యారు. వీరిలో బాలుర జట్టుకు కె.చిరంజీవి, ఎం.మనోహర్, డి.జాన్సన్, కె.శ్రీనాథ్, టి.ప్రవీణ్ కుమార్, స్టాండ్ బైలుగా ఆర్.సంతోష్, కె.శామ్యూల్ రాజు, కె.సాత్విక్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఒ.దీవెన, పి.గాయత్రి, కె.గీతిక, బి.కెజియా, బి.అహల్య, స్టాండ్ బైలుగా డి.స్వరూప, కె.థెరిస్సారాణి, కె.సంగీతలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి పి.శివరామకృష్ణ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్త నాయక్, వై.చిరంజీవి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 కార్యదర్శి జి.నరసింహారావు, ఆదిత్య ఫిజికల్ ఎడ్యుకేషన్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, విద్యా కేంద్రం జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు, తోక సోమనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, కోణంకి కిరణ్ కుమార్, ప్రసన్న, మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి



పెదకూరపాడు: లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీసీ పెదకూరపాడు సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ పెద్ద ఇమాంబీ అన్నారు. పెద్దకూరపాడులోని అంగన్‌వాడీ-4 సెంటర్ పరిధిలో లింగ వివక్షత నిర్మూలనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాంబీ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా ప్రోత్సాహాలు అందిస్తున్నారని తెలిపారు. స్త్రీకి ప్రాధాన్యమిస్తే సమాజం, కుటుంబంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గోగులపాటి కుమారి, విజయలక్ష్మి, కైరున్, నజీరున్ తదితరులు పాల్గొన్నారు.

గణేషుడికి ప్రత్యేక పూజలు



వినాయకుడికి బెలూన్ల అలంకరణ



ప్రత్యేక అలంకరణలో గణేషుడు

మాచర్ల: పట్టణంలో వినాయక నిమజ్జనాల సందర్భంగా ఊరేగింపులు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పాతూరులో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద సీతారామ గణేష్ సేవా కమిటీ ఆధ్వర్యంలో గణేషుని ప్రత్యేకంగా అలంకరించారు. 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశునికి లంబోధర కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. బురుజు సెంటర్‌లో లింగబలిజ సంఘీయుల ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 13వ వార్డులో వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనాలు అధిక సంఖ్యలో జరిగాయి.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

దోమల నివారణతో విషజ్వరాలు దూరం

మల్లవరం(రెంటచింతల): నివాస పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు దరి చేరవని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా గురువారం మండలంలోని మల్లవరం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామాలలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ వారి నివాస పరిసరాలను మురుగునీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సైడు కాల్వలపై వారానికి ఒకసారి కిరోసిన్, బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో దోమల ఉధృతిని నివారించవచ్చన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తల నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యం పొందాలన్నారు. ఏఎన్‌ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

ఎరువుల దుకాణాల తనిఖీ

మాచర్ల: మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి మండలంలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. మండలంలో 152 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. యూరియా ఎమ్మార్పీకే అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతర జిల్లాలకు, అంతర రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయరాదని, అలాచేసే వ్యాపారులు, వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై దృష్టి సారించాలని తెలిపారు. దీని వలన పంటలకు పోషకాలు అధిక మొత్తంలో అందుతాయని చెప్పారు. మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న జీడీసీఎంఎస్‌లో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు తనిఖీ చేసి, పొలం విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు పంపిణీ చేశారు. రైతులు పంటల్లో మూడు దశల్లో యూరియా వినియోగించాలని, మొత్తం ఒకేసారి వినియోగించడం వలన, పర్యావరణం, భూమి కలుషితం అవుతాయని తెలిపారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ పాపకుమారి

తహసీల్దార్‌కు సన్మానం

దుర్గి: దుర్గి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కరుణకుమార్‌ను దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ గురువారం శాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దళిత వాడల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని జరపాలన్నారు. లైంగిక దాడులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



పాఠశాలకు బడి ఈడు పిల్లలు



బడిబయట పిల్లలతో ఎంఈఓ-2 రాఘవేంద్రరావు, హెచ్‌ఎంలు

సత్తెనపల్లి: బడి బయట పిల్లలను నలుగురిని గుర్తించి గురువారం అధికారులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల స్పిన్నింగ్ మిల్ ఏరియాలోని బడి బయట పిల్లల్ని మండల విద్యాశాఖ అధికారి ఏ.రాఘవేంద్రరావు నేతృత్వంలోని బృందం బడి ఈడు పిల్లలకి చదువు విశిష్టతను వివరించారు. అనంతరం నలుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఒప్పించారు. ఐదవ తరగతి పూర్తి చేసిన పాపు నాహక్, ప్రియ నాహక్, నాయక్ ఆశ, చట్టు హరివంశీలు బడి బయట ఉండడంతో ఆరో తరగతి చదివేందుకు వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. బృందంలో వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వెన్నాదేవి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నరాజ్, కంకణాలపల్లి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఉన్నారు.